చట్టాలకు లోబడి దర్యాప్తు చేయాలి

మాట్లాడుతున్న ఎస్పీ జానకి

• పాలమూరు ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 8: నూతన చట్టాల ప్రకారం కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన విధానాల మీద కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు సంపూర్ణ సమజ్ఞానం, అవగాహన ఉండాలని ఎస్పీ జానకి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు నూతన న్యాయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు లీగల్ అడ్వైజర్ రాములు పోలీసుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. కొత్త చట్టాల ద్వారా కేసుల విచారణ వేగంగా పూర్తవుతుందని, న్యాయవ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సమాజంలో శాంతిభద్రతలు కాపాడడంలో నూతన చట్టాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసు శాఖ నూతన చట్టాలను సమర్థవంతంగా అమలు చేసేదిశగా ముందుకెళ్తుందని తెలిపారు. లీగల్ అడ్వైజర్ రాములును ఎస్పీ శాలువాతోపాటు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీటీసీ డీఎస్పీ గిరిబాబు, టూటౌన్ సీఐ ఇజాజ్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, మహిళా పోలీసుస్టేషన్ సీఐ శ్రీనివాసులు, జిల్లాలోని పోలీసు స్టేషన్ అధికారులు , పీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

• కలెక్టర్ విజయేందిరబోయి

గురుకులంలో 5వ తరగతి విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. శనివారం పట్టణంలోని భగీరథకాలనీలో ఉన్న మైనారిటీ బాలికల గురుకుల, పాఠశాల కళాశాల–2ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తాజా కూరగాయలతో స్వచ్ఛమైన, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. ఆహారపదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం అత్యుత్తమ గ్రేడ్లతో ఉత్తీర్ణత సాధించేలా నాణ్యమైన బోధన అందించాలని సంబంధిత అధికారులు, బోధన సిబ్బందికి సూచించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి ఏ, బీ సెక్షన్‌లను, 5వ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వంటగది, స్టోర్ రూం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అదిస్తున్నారా.? అని ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఎటువంటి ఆందోళన పడకుండా బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8: ఈవీఎంల గోడౌన్ వద్ద గట్టి భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలవారి తనిఖీల్లో భాగంగా ఐడీవోసీ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రక్షణ కల్పించాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. గోదాం గదుల సీల్‌లను తనిఖీ చేశారు. ఈవీఎం గోదాం భద్రతకు నియమించిన సిబ్బంది హాజరు, పోలీసు బందోబస్తు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కేవీవీ.రవికుమార్, ఎన్నికల విభాగం ఉపతాసీల్దార్ జాఫర్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఊట్కూర్, ఫిబ్రవరి 8: మండలంలోని మల్లేపల్లి, చిన్నపొర్ల పంచాయతీలోని పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో ధనుంజయగౌడ్ శనివారం పరిశీలించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా బూత్‌లను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

దామరగిద్ద, ఫిబ్రవరి 8: జాయమ్మ చెరువు రిజర్వాయర్ విస్తరణలో భాగంగా దామరగిద్ద తండాకు చెందిన బాపన్‌పల్లి శివారులో వంద ఎకరాల భూమిని కాకుండా పక్కనే ఉన్న నల్ల గుట్టను తీసుకుని పంప్‌హౌస్, పవర్ స్టేషన్ నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎవరూ అభివృద్ధి అడ్డుకాదని అదే వారి ఉపాధికి ఆసరగా ఉన్న ఒక్క ఎకరం ప్రభుత్వం నోటీసులు ఇవ్వకుండా లాక్కుంటే వారి ఉపాధి ఆగమవుతుందన్నారు. ప్రభుత్వం భూమి తీసుకున్న రైతులకు వేరే చోట భూమిని ఇవ్వాలని, లేదంటే ఎకరానికి రూ. 50 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటు సోమవారం రైతులందరూ కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబునాయక్, గడిమున్‌పల్లి మాజీ సర్పంచ్ జి సుభాష్, రైతులు వెంకట్‌నాయక్, సీత్యానాయక్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్, ఫిబ్రవరి 8: భార్యతో గొడవపడి ఓ భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం బాలానగర్‌లో చోటుచేసుకున్నది. మండల కేంద్రానికి చెందిన కుచ్చరకంటి రమేశ్(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుంటుబాన్ని నడిపిస్తున్న రమేశ్ భార్య సంధ్యతో తరచూ గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం సాయంత్రం తాగిన మైకంలో భార్యతో గొడవపడ్డాడు. ఆవేశంలో ఉన్న రమేశ్ శనివారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో చింతచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

భూత్పూర్, ఫిబ్రవరి 8: మండలంలోని తాటికొండలో భార్యచేతిలో భర్త హత్యకు గురైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. భూత్పూర్ సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాసమ్మ, మల్లేశ్(40) కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి గొడవపడ్డారు. ఈ ఘటనలో మాసమ్మ భర్త కళ్లల్లో కారం పొడి చల్లి పక్కనే ఉన్న రోకలిబండతో కాళ్లు, చేతులు, జననేంద్రియాలపై ఇష్టానుసారం కొట్టింది. దీంతో మల్లేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాగనూరు ఫిబ్రవరి 8: మండల కేంద్రంలో పేకాట స్థావరం పై పోలీసులు దాడులు చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై అశోక్ శనివారం ప్రకటనలో తెలిపారు. వివరాలిలా.. మాగనూర్ సమీపంలోని రేకుల షెడ్డులో శనివారం మధ్యాహ్నం కొంతమంది డబ్బులు పందెం పెట్టుకుని రహస్యంగా పేకాట ఆడుతుండగా నమ్మదగిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది ఆకస్మికంగా దాడులు చేసి పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని వారి వద్ద నుంచి నగదు రూ. 2 వేలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దామరగిద్ద మండలంలో..

దామరగిద్ద, ఫిబ్రవరి 8: మండలంలోని పేకాట స్థావరంపై ఎస్సై రాజు పోలీసు సిబ్బందితో శనివారం ఆకస్మికంగా దాడులు చేశారు. పేకాడుతున్న గడ్డమీది కన్కప్ప, రెనివట్ల ఎండీ హుస్సేన్, కర్ణాటక గుర్మిట్కాల్ చెందిన చికిలి బాల్‌రాజు, దేవరకొండ నరేందర్, సూర్యానాయక్ ఖాజీపూర్, వెంకటయ్య పల్లెర్ల, నడిమింటి శ్రీను పెదిరిపాడు, మేకల లాలప్ప భీంపూర్ వారిని పట్టుకుని వారి వద్ద రూ. 17500 నగదు, ఏడు సెల్ ఫోన్లు, 10 బైకులు, కారు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు శనివారం 96శాతానికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 1,127 మందికి 1,093 మంది హాజరు కాగా 96.98 శాతం, మధ్యాహ్నం 858 మందికి 827 మంది హాజరు కాగా.. 96.39శాతం నమోదైంది. కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కౌసర్‌జహాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో డీఐఈవో కార్యాలయ సూపరింటెండెంట్ సందీప్‌రెడ్డి, సీనియర్ సహాయకుడు సాధిక్, జూనియర్ సహాయకుడు ఆలీ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 1993–94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులంతా హాజరై.. జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కుటుంబ సర్వేలో బీసీలకు అన్యాయం

మూసాపేటలో తిరుపతయ్యగౌడ్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

మూసాపేట, ఫిబ్రవరి 8: బీసీ కోటా పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ పొలిటికల్ జేఏసీ మండలాధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్ అన్నారు. శనివారం మూసాపేటలో గౌడ సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్యగౌడ్‌ను గౌడ సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు సమగ్ర కుటుంబ సర్వేలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలు 52శాతం బీసీల జనాబా ఉందని ప్రకటించారు. ఇప్పుడు నిర్వహించిన సర్వేలో తప్పుడు లెక్కలు చూయిస్తూ 46.25 బీసీలు ఉన్నట్లు చెబుతున్నారు. కానీ వారు చూపించిన లెక్క ప్రకారం అయినా జనాభా ప్రకారం 42శాతం రిజర్వేషన్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోటా లెక్కలు తేల్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం బీసీ కులాలకు అనుకులంగా ఉంటుందని భావిస్తున్నట్లు, వెంటనే బీసీ కోటాను పెంచాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండలాధ్యక్షుడు శశిధర్‌గౌడ్, మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, నాయకులు రాజేశ్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, శరత్‌చందర్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, గౌతమ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికే అభివృద్ధి పనుల నిలిపివేత

• మాజీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి

భూత్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భూత్పూర్, ఫిబ్రవరి 8: రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీ పరిధిలో పనులను నిలుపుదల చేశారని మున్సిప్ మాజీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మున్సిపాలిటీ పరిధిలో రూ.6కోట్ల 50లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ప్రకటించారు. ఇది ముమ్మాటికి తప్పన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మున్సిపాలిటీకి దాదాపు రూ.3కోట్లతో పనులను మంజూరై, టెండర్ పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీకి కొత్తగా మంజూరైన ట్రాక్టర్లు, వైకుంఠ రథాలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీకి ఐదేండ్లలో పన్నుల రూపేణా రూ.3కోట్ల98 లక్షలు జమ అయినట్లు తెలిపారు. ఈ మొత్తం డబ్బులు ఇప్పుడు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏడాది నుంచి ఒక్క రూపాయి మంజూరు కాలేదని, ఉన్న నిధులతో పనులు చేయాలంటే కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే పాలక మండలి పదవీ కాలం పూర్తయ్యాకే పనులను ప్రారంభించాలని రాజకీయ కక్షతో పనులను నిలిపివేశారని విమర్శించారు. రాజకీయంగా లబ్ధి పొందడం తప్పు కాదని.. అభివృద్ధికి అడ్డంకిగా ఉండడం సరికాదని.. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గమనించాలని కోరారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదనడం సరికాదని.., ఈ విషయంపై గ్రామాల్లో ప్రజలను అడిగితే చెప్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేందిలేదని తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మురళీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితోనే మండలంలోనే కాదు నియోజకవర్గ వ్యాప్తంగా ఎంత అభివృద్ధి జరిగిందో ప్రస్తుత ఎమ్మెల్యే పరిశీలించాలని హితువు పలికారు. ఒక్క భూత్పూర్ మండలంలోనే 8గ్రామాలకు కొత్తగా బీటీరోడ్లను వేసిన ఘనత ఆల వెంకటేశ్వర్‌రెడ్డిదన్నారు. మున్సిపాలిటీలో తండాతండాకు బీటీరోడ్లను రూ.12కోట్ల60లక్షలతో పనులను మంజూరు చేశారు. ఇందులో కొన్ని రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. మీకు ప్రజలు అవకాశం కల్పించారు. ఇంకా ఎక్కువ అభివృద్ధిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తూర్ నారాయణగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ రాములు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సురేశ్, బీఆర్ఎస్ నాయకులు మురళీధర్‌గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి కేటీఆర్ రైతు ధర్నాను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు రామలింగం

మక్తల్, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రాష్ట్ర రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొడంగల్‌లో చేపట్టబోయే కేటీఆర్ రైతు సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు రామలింగం పిలుపునిచ్చారు. శనివారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం రాక ముందు ఇచ్చిన హామీలు, తెలంగాణ ప్రజలను మోసం చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తీరును ఎండగట్టాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టే రైతు సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. తెలంగాణ ప్రజలు, రైతులను మోసం చేయడంతోపాటు ఢిల్లీ ప్రజలను మోసం చేయాలని చూసిన కాంగ్రెస్‌కి ఢిల్లీ ఓటర్లు తగిన రీతిలో బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్ ఓటమికి పాలైందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సుల్తాన్, మహమ్మద్ ఉన్నారు.

ప్రతిభ ఉంటే బంగారు భవిష్యత్

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 8: ప్రతిభ ఉన్న విద్యార్థులకు బంగారు భవిషత్ ఉంటుందని అడ్డాకుల ఎంఈవో కురుమూర్తి అన్నారు. శనివారం ఎమ్మార్సీలో అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్, డ్రీంకోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌లో కందూరు, శాఖాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ ప్రదర్శనలిచ్చారు. కందూరుకు చెందిన తెలుగు మీడియం ఉమాదేవి మొదటి బహుమతి, 2వ బహుమతి ఈశ్వర్, 3వ బహుమతి శాఖాపూర్‌కు చెందిన రెహానా బేగం గెలుపొందారు. అదేవిధంగా ఇంగ్లిష్ మీడియంలో మొదటి బహుమతి ప్రవీణ్‌కుమార్‌గౌడ్, 2వ బహుమతి శిరీష, 3వ బహుమతి నందిని గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, నిర్మల, హెచ్‌ఎం రాములు, సీఆర్పీ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మూసాపేట, ఫిబ్రవరి 8: మండలంలోని సంకలమద్ది జాతీయ రహదారిపై స్కూటీని కారు ఢీ కొట్టగా.. వ్యక్తికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకున్నది. మూసాపేట ఎస్సై వేణు కథనం ప్రకారం.. అడ్డాకుల మండలంలోని రాచాలకు చెందిన ఎండీ జాంగీర్ వేములలోని ఎస్‌జీడీ పరిశ్రమంలో పనిచేస్తాడు. మహబూబ్‌నగర్ నుంచి స్కూటీపై వేముల ఎస్‌జీడీ పరిశ్రమకు వెళ్తుండగా మార్గమధ్యంలో సంకలమద్ది స్టేజీ వద్ద హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీ కొట్టింది. జాఫర్‌కు బలమైన రక్తగాయాలు కావడంతో జిల్లా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐఎఫ్‌పీ బోర్డులను సమర్థవంతంగా వినియోగించాలి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 8: ఐఎఫ్‌పీ బోర్డులను సమర్థవంతంగా వినియోగించి బోధన అభ్యసన ప్రక్రియను మరింత మెరుగ్గా చేయాలని శిక్షణ కలెక్టర్ గరిమాన రుల అన్నారు. శనివారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు (సీఆర్‌పీలకు) ఒకరోజు ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ఆమె సందర్శించి మాట్లాడారు. శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్‌లు కాంప్లెక్స్ స్థాయిలో సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

నారాయణపేట, ఫిబ్రవరి 8: ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ తెలిపారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు.. కేంద్ర బడ్జెట్ కార్మికులకు, కర్షకులకు, దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఉందని, మధ్య తరగతి, సంపన్న వర్గాలు, పారిశ్రామిక వేత్తలకు మేలు కలిగించేలా ఉందన్నారు. మహాధర్నాలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, ఉపాధ్యక్షుడు జోషి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి పాల్గొన్నారు.

విద్యను మొదటి కర్తవ్యంగా భావించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: విద్యార్థులు ఆలోచన శక్తిని మెరుగుపర్చుకోవడంతోపాటు చదువు మొదటి కర్తవ్యంగా భావించి ముందుకు సాగాలని మోటివేషనల్ స్పీకర్ ఆనంద్ సూచించారు. శనివారం మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం ధర్మాపూర్ సమీపంలోని జయప్రకాశ్‌నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్ఫూర్తి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏదైనా పనిచేసేటప్పుడు సమస్యల గురించి ఆలోచించకుండా సానుకూలంగా పాజిటివ్ థింకింగ్ ఉండేలా జాగ్రత్త పడాలన్నారు. తెలుగు మీడియం బ్యాక్‌గ్రౌండ్ నుంచే నేను అమెరికాలో ఉన్నతమైన స్థానంలో స్థిరపడ్డానన్నారు. కళాశాల చైర్మన్ కేఎస్.రవికుమార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన, ఉన్నత స్థాయిలో ఉన్నవారి గురించి తెలుసుకుంటే విద్యార్థులు సైతం జీవితంలో అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత సాయితేజ, ఆనంద్ సతీమణి పుష్పలత, దీప్తి, దివ్యాన్ష, జేపీఎన్‌సీఈ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భోజనాన్ని పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం దత్తరావు

నారాయణపేట రూరర్, ఫిబ్రవరి 8: మండలంలోని జాజాపూర్ ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దత్తరావు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ మెనూ ప్రకారం చేపట్టాలని వంట చేసే వాళ్లకు సూచించారు. పిల్లలకు రుచికరమైనటువంటి ఆకుకూరలతో కూడిన వంటలను చేయాలని పేర్కొన్నారు. వంట పాత్రలు శుభ్రంగా చేసి వంట చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించకుండ పోషకాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశం చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, సీఆర్పీ పవిత్ర, మంగళ, భానుప్రకాశ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రేషన్ బియ్యం దగ్ధం

మహ్మదాబాద్, ఫిబ్రవరి 8: మండలంలోని మొకర్లాబాద్‌లో రేషన్ షాప్‌లో శుక్రవారం రాత్రి షార్టుసర్క్యూట్ కావడంతో రేషన్ బియ్యం బస్తాలు దగ్ధమయ్యాయి. రేషన్ షాపు నుంచి మంటలు పొగ రావడంతో గ్రామస్తులు, రేషన్ డీలర్ లక్ష్మణ్ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ ఇంజన్ వాళ్లకు సమాచారం అందించి మంటలను అదుపు చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వచ్చి రేషన్ షాపును పరిశీలించి 40శాతం బియ్యం బస్తాలు కాలిపోయినట్లు గుర్తించారు. సుమారు 30 బస్తాల బియ్యం, 200 ఖాళీ సంచులు కాలిపోగా మంటలను ఆర్పేందుకు నీళ్లు చల్లడంతో బియ్యం బాస్తాలు నీటితో తడిసిపోయాయి. కరెంటు షార్టుసర్క్యూట్‌తోనే మంటలు చెలరేగాయని రేషన్ డీలర్, గ్రామస్తులు పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

జడ్చర్ల, ఫిబ్రవరి 8: జడ్చర్ల మున్సిపాలిటీలోని 25వ వార్డులోని కాలనీల్లో నెలకొన్న ప్రజల సమస్యలను పరిష్కరించనున్నట్లు జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత కాలనీవాసులకు తెలిపారు. శనివారం చైర్‌పర్సన్ పుష్పలత 25వ వార్డులోని ఝాఖీనగర్‌కాలనీలో పర్యటించారు. పిచ్చిమొక్కలు, కంపచెట్లు తొలగించాలని కోరారు. అనంతరం కాలనీవాసులు చైర్‌పర్సన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కోనేటి నర్సింహులు, అజారుద్దీన్, రఫీ, ఉమర్, కుద్దూస్, సిద్దిఖ్, అఫ్రోజ్ ఉన్నారు.

పది పరీక్షలపై అవగాహన

నవాబ్‌పేట, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నవాబ్‌పేట, లింగంపల్లి, చౌడూర్, సూర్యతేజ, గీతాంజలి, కేజీబీవీలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పది పరీక్షలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు పరీక్షల మోటివేటర్ మల్లయ్య హాజరై విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నాగ్యానాయక్, వివిధ పాఠశాలల జీహెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

• ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఫిబ్రవరి 8: పాఠశాలల్లో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కౌకుంట్ల మండల కేంద్రంతోపాటు ముచ్చింతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జీఎంఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన స్టడీమెటీరియల్, కోజెంట్ పరిశ్రమ సహకారంతో పాఠశాలకు కాలినడకతో వచ్చే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దేవరకద్ర, ఫిబ్రవరి 8: తెలంగాణలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల మండలాల్లోని గ్రామాలకు చెందిన రైతులకు 30 విద్యుత్‌ట్రాన్స్‌పార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

జాతీయ పోటీలకు ఉమ్మడి జిల్లా యోగా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 8: 49వ జాతీయ స్థాయి యోగ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 8మంది క్రీడాకారులు ఎంపికైయ్యారని జిల్లా అధ్యక్షుడు రాములు, కార్యదర్శి బాలరాజు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు ఈనెల 11 నుంచి 15వరకు కేరళలోని తిరువనంతపురంలో జరుగనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని కోరారు. క్రీడాకారుల వివరాలు శ్రీకాంత్, ప్రకాశ్, 25–30ఏడ్లు, మధు, సాగర్ 18–21ఏండ్లు, వెంకటేశ్ 35–40ఏండ్లు, బాలమణి 25–30 ఏండ్లు, స్వప్న, శ్వేత 18–21ఏండ్లు శనివారం స్థానిక స్టేడియంలో యోగా సంఘం సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విద్యకు 20శాతం నిధులు కేటాయించాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న టీవీపీసీ నాయకులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8: సమాజంలో విద్య ప్రాధాన్యతను గుర్తించి రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టీవీపీసీ) నాయకులు డిమాండ్ చేశారు. విద్యకు బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించారంటూ శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్న సమాజంలో విద్య ప్రాధాన్యత గుర్తించాలన్నారు. రాష్ట్రంలో విద్యకు తగిన ప్రాధాన్యత ఇస్తామనే వాగ్దానంతో ప్రజాపాలన ప్రభుత్వం గెలిచిందన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కాక 2024–25 బడ్జెట్‌లో విద్యకు కేటాయించింది కేవలం 7.3శాతం మాత్రమే అన్నారు. ఇది దేశంలో ఇతర రాష్ట్రాలలో విద్యకు కేటాయించి బడ్జెట్ సగటు 14.7శాతంలో సగం కన్నా తక్కువే అన్నారు. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు అడుగంటి పోతున్నాయని అన్నారు. వెంటనే బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిని కలెక్టర్ విజయేందిరబోయికి అందజేశారు. కార్యక్రమాల్లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహమూద్, వెంకటేశ్వర్లు, డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, నాగేశ్వర్, ఓంకార్, సృజన, ఆదిత్య, కురుమూర్తి, టీపీటీఎఫ్ ఆశప్ప, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PM సూర్యఘర్
★ 78000/- రూ॥ల సబ్సిడీ, 360 యూనిట్లు నెలకు ఫ్రీ, SBI లోన్ సౌకర్యం కలదు. మిగతా వివరాలకు సం॥ప్ర॥ NEW PLANER POWER SOLUSIONS, Newtown, Mahabubnagar. Cell:8686166354, 7842520780.
NT-MBNR

CHANGE OF NAME
★ I, MOHAMMED GHIYASUDDIN, R/o. 13-138, Kaverammapeta, Jadcherla, Mahabubnagar-509 301, TS. Changed My Name as "MOHAMMED GAYASUDDIN, S/o. Mohammed Jahangeer".
NT-330465

డాక్యుమెంట్ పోయినవి
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడం ఏమనగా! శ్రీమతి మనల్‌రఫత్ తండ్రి శ్రీ మహమ్మద్ ముజాహిద్ అలీ, నివాసం: ఇం.నెం. 14-5-121/ C/5, BK రెడ్డి కాలనీ, మహబూబ్‌నగర్ జిల్లా గారి యొక్క మహబూబ్‌నగర్ పట్టణంలో గల ప్లాటు అనగా భూమి సర్వే నెం.94లో ప్లాటు నెంబర్ 3 లో నిర్మించుకున్న గృహము ఇం.నెం. 14-5-121/ C/5, గల గృహము యొక్క లింక్ డీడ్ / డాక్యుమెంట్ నెం.10583/2012, తేది: 23-11-2012 గల ఒరిజినల్ లింక్ డీడ్ డాక్యుమెంట్ ఎక్కడో పడిపోయినది. కావున ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైన లభించినచో క్రింది నెంబరుకు తెలియపరుచగలరు.
శ్రీమతి మనల్ రఫత్ సెల్ నెంబర్ :
9700962535

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748